క్లుప్తంగా

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి: సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్, అధికారులు

నర్సాపూర్: రాజకీయాలకు అతీతంగా నర్సాపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మున్సిపాలిటీ పాలక వర్గానికి సూచించారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను మున్సిపాలిటీ గణాంక అధికారి వెంకట్‌రావు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేసి బదిలీ అయిన వెంకట్ గోపాల్‌ను ఎమ్మెల్యే సునీతారెడ్డి, చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు సన్మానించారు.

దుర్గమ్మ సేవలో నర్సాపూర్ ఎమ్మెల్యే

పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్ ఆమెకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ఆమె వెంట నర్సాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఏ ప్లస్ గ్రేడ్ సాధనకు శ్రమించండి

కొల్చారం(నర్సాపూర్): మరో 30 రోజుల్లో ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఏ ప్లస్ గ్రేడ్ సాధించేలా ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుల వారీగా శ్రమించి విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని మండల విద్యాధికారి నీలకంఠం ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్న ఘనాపూర్ ఉన్నత పాఠశాలను ఫార్మేటివ్ అసైన్మెంట్ మానిటరింగ్ టీంతో కలిసి సందర్శించారు. ప్రాజెక్టులు, నోట్స్‌ను పరిశీలించారు. మండల విద్యాధికారి, నోడల్ అధికారి సత్యానారాయణ, సబ్జెక్టు నిపుణులు మధుకర్, బాలకిషన్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాములు, జరీనా, రమణ కుమార్, సంగయ్య, సుగుణ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల రాస్తారోకో



రామాయంపేటలో రాస్తారోకో చేస్తున్న ఆటోల డ్రైవర్లు, ఆశ కార్యకర్తలు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం తమను ఆదుకోవాలని శుక్రవారం అల్లాదుర్గం 161 జాతీయ రహదారిపై ఆటో, టాక్సీ డ్రైవర్లు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఉపాధి లేక ఫైనాన్స్ డబ్బులు కట్టలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

రామాయంపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు, యజమానులు శుక్రవారం రామాయంపేటలో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆందోళనకు ఆశ కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. ఆందోళనలో పలు రామాయంపేట, నిజాంపేట మండలాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. హెచ్‌ఎం లతాంబేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాసిన రికార్డుల్లో మార్కులు పరిశీలించారు. బోనాల్, రెడ్డిపల్లి, చందాయిపేట పాఠశాలల్లో నిర్వహించిన రికార్డుల పరిశీలనలో లక్ష్మణ్, బక్కప్ప, శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, ఈశ్వరయ్య, నవిత, ఖాజా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరతోనే అభివృద్ధి

రేగోడ్(మెదక్): రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ యాదగిరి అన్నారు. మండలంలోని సిందోల్ గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బాబుపటేల్, రాచప్ప, మాణెప్ప, విజ్జప్ప, సంగారెడ్డి, భాస్కర్, పాపిరెడ్డి, సాయిలు, రామప్ప, ఆగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు



నర్సాపూర్‌లో ర్యాలీగా వెళ్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు



పాపన్నపేటలో ..



రేగోడ్‌లో..

నర్సాపూర్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్‌లో ర్యాలీగా వెళ్లి చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ, నాయకులు రమేశ్, రాములు, నర్సింలు, శంకర్, రాంచదర్, పుష్ప, వరలక్ష్మి, నాగరాణి పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ప్రశాంతంగా కొనసాగింది. బంద్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నరేందర్, హమాలి సంఘం నాయకులు బాబు, వెంకట్, సాయిలు, అశోక్, యాదగిరి, భిక్షపతి పాల్గొన్నారు.

ఉద్యమాలు చేస్తాం

రేగోడ్(మెదక్): కేంద్ర ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేంత వరకు ఉద్యమాలు నిర్వహిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.సర్దార్ అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి హనుమంతు, ఆటో యూనియన్ మండల నాయకులు రామాగౌడ్, శివరాజ్, సాయిలు, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, పద్మ, భూమామ్మ, కళావతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శివ్వంపేటలో ..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని తూప్రాన్- నర్సాపూర్ హైవేపై రాస్తారోకో చేసిన వారిలో సీఐటీయూ నాయకులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో రాస్తారోకో చేసిన వారిలో హాజరైన సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, కార్మిక రంగాల నాయకులు శివ లక్ష్మి, స్వరూప, లక్ష్మి, చంద్రకళ నాగమణి, గీత, సబిత, రమ, రాణి, దుర్గయ్య, ప్రభాకర్, ప్రభు, శేఖర్, సంతోష్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మట్టి టిప్పర్ల అడ్డగింత



రోడ్డుపై టిప్పర్లను అడ్డుకున్న యువకులు

- అతివేగాన్ని నిరసిస్తూ అడ్డుకున్న యువకులు
- భారీగా నిలిచిపోయిన వాహనాలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన చెరువు నుంచి నల్లమట్టిని కొన్ని రోజులుగా ఇతర జిల్లాలకు టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. కాగా టిప్పర్లు అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పట్టణానికి చెందిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ సమీపంలో బైకులపై వెళ్లే వారితో పాటు చౌరస్తాలో ఇతర వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారని వారు మండిపడ్డారు. అతి వేగాన్ని నిరసిస్తూ యువకులు రోడ్డుపై అడ్డంగా నిలబడి టిప్పర్లను నిలిపేశారు. దీంతో పెద్ద సంఖ్యలో టిప్పర్లు నిలిచి పోయాయి. కాగా బస్టాండు సమీపంలో యువకులు రోడ్డుపై టిప్పర్లను అడ్డుకోవడంతో పలు టిప్పర్లను సంగారెడ్డి మార్గంలోనే నిలిపి వేయడం గమనార్హం. కాగా పట్టణానికి చెందిన పలువురు నాయకులు అక్కడికి వచ్చి శనివారం ఉదయం మాట్లాడుదామని నచ్చ చెప్పడంతో యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వెంచర్లకు అక్రమంగా కాళేశ్వరం మట్టి

నర్సాపూర్: కాళేశ్వరం కాల్వ తవ్వగా వచ్చిన మట్టిని పలువురు బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా తరలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామం మీదుగా కాళేశ్వరం కాల్వ తవ్వి ఆ మట్టిని కాల్వకు ఇరువైపుల పోశారన్నారు. కాగా ఇటీవల పలువురు మట్టి వ్యాపారం చేసే బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం మట్టిని రెడ్డిపల్లి నుంచి నర్సాపూర్‌లోని ఓ వెంచర్‌కు రాత్రి పూట మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా.. ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

మీటర్ తొలగించినా రూ.2 లక్షల బిల్లు



విద్యుత్ వినియోగదారుల సదస్సు

పాపన్నపేట(మెదక్): తన ఇంటి మీటర్ తొలగించి ఏళ్లు గడుస్తున్నా.. రూ.2 లక్షల విద్యుత్ బిల్లు వచ్చిందని శంకరంపేట(ఏ) మండలంలోని జంబికుంట గ్రామానికి చెందిన శ్రీనివాస్ శుక్రవారం పాపన్నపేటలో జరిగిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించి 5 మండలాల పరిధిలోని వినియోగదారుల కోసం పాపన్నపేటలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 74 మంది వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణారావు, ఏడీఓ మోహన్‌బాబు, ఏఈలు ఉదయ్ కుమార్, నర్సింలు, లైన్‌మెన్ సమీరుద్దీన్, రవీందర్, అస్లాం, సురేందర్, టాపిక్ అలీ, వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించండి

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువులో వెనుకబడిన పిల్లలను గుర్తించి ప్రోత్సహించాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. దామోదర్ ఎన్ఎస్ఎస్ క్యాంపు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పెద్దచింతకుంట వద్ద ఉన్న నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ క్యాంపు విద్యార్థులకు పిల్లల కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సీఎంఓ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హేమంతులు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు.



బ్యాడ్జీలతో విద్యార్థులు

బోనాల ఊరేగింపు



బోనాల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శుక్రవారం బోనాలను ఊరేగించారు. అనంతరం నూతన బొంబుగొండ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొంబుగొండ విగ్రహం నిర్మాణానికి సహకరించిన బేగరి మొగులయ్యను కుర్మసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

వైభవంగా తిరుమల బ్రహ్మోత్సవాలు



జాతరలో భక్తుల సందడి

నిజాంపేట(మెదక్): చల్మెడలో తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వేడుకలకు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం బండ్ల ఉరేగింపుతో పాటు కల్యాణం నిర్వహించారు. అనంతరం తిరుమలనాథ స్వామి వారికి శ్రీనివాస్‌రావు వెండిని బహూకరించారు. అలాగే చల్మెడ తిరుమల దేవస్థాన ఆలయ కమిటీ సభ్యులను సన్మానించారు. డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ వెంకటేశం, రామాయంపేట సర్కిల్ ఎస్ఐలు బందోబస్తు పర్యవేక్షించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చిన్నారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): వేసవిలో నీటి సమస్యలు లేకుండా గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని నార్సింగి ఎంపీడీఓ చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం నార్సింగి ఎంపీపీ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేశ్ పాల్గొన్నారు. వచ్చిన ఎంపీడీఓ చిన్నారెడ్డిని ఎంపీపీ సబిత, ఎంపీటీసీలు, కార్యదర్శులు సత్కరించారు.

రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

నర్సాపూర్ రూరల్: రైతులందరూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సాగు పెట్టుబడి కి అందిస్తున్న పీఎం కిసాన్ పథకం కోసం ఈ కేవైసీ చేయించుకోవాలని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివ కుమార్, మండల వ్యవసాయ అధికారి అనిల్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రుస్తుంపేట గ్రామపంచాయతీ భవనంలో ఈ కేవైసీ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ చంద్రవేణి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సూర్య నమస్కారాలు



పెద్దశంకరంపేటలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



మెదక్‌లోని శిశుమందిర్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): రథ సప్తమిని పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలను చేయించారు. శుక్రవారం ఆయా పాఠశాలల్లో సూర్యనమస్కారాలతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. దీంతో పాటు పేటలోని వేంటేశ్వరాలయం, కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో భక్తులు రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విపత్తు సమయాల్లో జాగ్రత్తలు అవసరం



ఫైర్ ఇన్సిడెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎండీఆర్ఎఫ్ సిబ్బంది

టేక్మాల్(మెదక్): పర్యావరణ విపత్తు సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం రైతువేదికలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎండీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఫైర్ ఇన్సిడెంట్స్, హెవీ రేయిన్స్ వాటర్, సీఆర్‌పీఎఫ్ వంటి పలు అంశాలపై ఆయా శాఖల అధికారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ స్వప్న, ఎంపీడీఓ రియజొద్దీన్, ఏఓ రాం ప్రసాద్, ఆర్ఐ సాయిశ్రీకాంత్, ఎండీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్, ఏఎస్ఐ మదిలేటెడ్, హెడ్ కానిస్టేబుల్ జగదీష్ ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



హవేళిఘణాపురం(మెదక్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): పొడిచన్‌పల్లిలో..



పెద్దశంకరంపేట(మెదక్): రామోజిపల్లిలో..

హవేళిఘణాపురం(మెదక్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్, అశోక్ కుమార్, రాజశేఖర్, రవీందర్, మహేశ్వరచారి, మనోహర్, రమేశ్, శశికుమార్, అశోక్, రాజేశం, సిద్ధిరాములు, ముజీబ్, శ్యామల, మధురాక్షి, స్వప్న పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పొడిచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రామోజిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

మా గ్రామంలో కెమికల్ పరిశ్రమ వద్దు



కలెక్టర్ కార్యాలయం వద్ద ఉసిరికపల్లి గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కెమికల్ పరిశ్రమ ఏర్పాటు చెయ్యొద్దని శుక్రవారం గ్రామస్తులు కలెక్టర్ రాజర్షిషాకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కెమికల్ పరిశ్రమ నిర్మిస్తే గ్రామంలో ఉన్న చెరువుల నీరు కలుషితం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రామచంద్రాపురంలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారావు, బాపురావు, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వేణుగుప్తా తదితరులు అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అక్రమంగా మట్టి రవాణా చేస్తే చర్యలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి శుక్రవారం అన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాయపల్లిలో గురువారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నా.. 3 టిప్పర్‌లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

◆ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని శుక్రవారం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ చేగుంట పట్టణాధ్యక్షుడు యాదగిరి తెలిపారు. మండలంలో అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను వివరించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలు గ్రామ శాఖల అధ్యక్షులు సిద్ధిరాములు, కుమార్, నాగులు, స్వామి, యాదగిరి, సత్యనారాయణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన సీఐని కలిసిన పాలాట గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): తూప్రాన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ కృష్ణని మండలంలోని పాలాట గ్రామస్తులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. సురేందర్, గోపాల్, సంతోష్, శ్రీనివాస్, వెంకటేష్ ఉన్నారు.

◆ సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన ఎస్ఐ రంజిత్‌రెడ్డిని శుక్రవారం మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన టమాట రైతు మహిపాల్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, యాదాగౌడ్, యాదుల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

◆ కంటివైద్య శిబిరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవంతంగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్సింలు, కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాశ్, నాగరాజు, డాక్టర్లు దీపు, మాధురి, ఉదయ్, విక్రమ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అనీల్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయులకు మెమో

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం 10:30 నిమిషాల వరకు రాకపోవడంతో విద్యార్థులంతా ఆరుబయట ఆడుకుంటున్నారు. ఇది గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంఈఓ యాదగిరికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. సమయపాలన పాటించకుండా ఉదయం 11:30 గంటల సమయంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి విధులకు హాజరవడంతో మెమో అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు.

◆ సన్మానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్యలతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతను జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల ప్రొహిబిషన్ కాలాన్ని పరిగణలోకి తీసుకొని రెగ్యులర్ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు కాయిత సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాతూరి రవి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ మల్లన్న జాతరకు ఆలయం ముస్తాబు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని మల్లన్న ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 18 నుంచి 21 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు గోకుల్‌యాదవ సంఘం సభ్యులు తెలిపారు.

◆ చిన్నశంకరంపేటలో పరిశ్రమలు బంద్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశ్రమల బంద్ నిర్వహించారు.

◆ కౌడిపల్లిలో రాస్తారోకో

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసిన వారిలో వివిధ రంగాల కార్మికులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

◆ రామాయంపేట ఎక్సైజ్ సీఐగా రాణి



రామాయంపేట(మెదక్): రామాయంపేట ఎక్సైజ్ సీఐగా రాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా సాలూరా చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న ఆమె బదిలీపై రామాయంపేట వచ్చారు.